క్లుప్తంగా

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

దేవరపల్లి: ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరు చేసిన ఆర్థిక సాయం చెక్కులను గురువారం దేవరపల్లిలోని తన క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే తలారి వెంకట్రావు లబ్ధిదారులకు అందజేశారు. దేవరపల్లికి చెందిన పఠాన్ ముంతాజ్‌కు రూ.2 లక్షలు, లక్ష్మీపురానికి చెందిన గోతం గౌతమికి రూ.2 లక్షలు మంజూరైనట్టు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

దేవరపల్లి: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఎంపీపీ కేవీకే దుర్గారావు అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ


దుస్తులు అందజేస్తున్న ఎంపీపీ దుర్గారావు

దేవరపల్లి: స్థానిక గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, సిబ్బందికి గురువారం గ్రామ సచివాలయం ద్వారా నూతన దుస్తులు అందజేశారు. 25 మంది పారిశుధ్య కార్మికులు, 18 మంది సిబ్బందికి సంక్రాంతి సందర్భంగా దుస్తులు కొనుగోలు చేసినట్టు అందజేశామని సర్పంచ్ కడిమి వీరకుమారి తెలిపారు. దుస్తులను ఎంపీపీ కేవీకే దుర్గారావు చేతుల మీదుగా కార్మికులు, సిబ్బందికి అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

నరేంద్రకు రాష్ట్ర సాహిత్య అకాడమీ పురస్కారం


పురస్కారాన్ని అందుకుంటున్న ఆరవల్లి నరేంద్ర

నిడదవోలు రూరల్: గోపవరం గ్రామానికి చెందిన ఆదరణాలయం వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ ఆరవల్లి నరేంద్ర రాష్ట్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారు. ఏలూరు వైఎంహెచ్ఏ ఆడిటోరియంలో బుధవారం రాత్రి కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో జరిగిన సంక్రాంతి వేడుకల్లో భాగంగా రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నట్టు నరేంద్ర తెలిపారు. బోయి భీమన్న సాహిత్య నిధి ట్రస్ట్ చైర్మన్ హైమావతి, గ్రామస్తులు నరేంద్రను అభినందించారు.

ఎరువులు, పురుగు మందుల షాపుల తనిఖీ


నల్లజర్లలో ఎరువుల షాపును తనిఖీ చేస్తున్న అనపర్తి ఏడీఏ కృష్ణ

నల్లజర్ల: మండలంలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాలను అనపర్తి వ్యవసాయ శాఖ ఏడీఏ డాక్టరు డీవీ కృష్ణ గురువారం పరిశీలించారు. స్టాకు రిజిష్టర్లు, గొడౌన్‌లో ఉన్న నిల్వలు, తూకం, ఈపోస్ యంత్రాల్లో నిల్వలను పరిశీలించారు. ఇందుకు సంబంధించిన పత్రాలు సక్రమంగా ఉన్నాయా అనే విషయాలను గమనించారు. నల్లజర్లలో సహకార సంఘం, త్రీఎఫ్ ఆయిల్ పామ్, వేణుగోపాల్ ఆగ్రోఏజెన్సీలలో ఈతనిఖీ నిర్వహించారు. నివేదికలను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ఆయనతో పాటు మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్, ఏఈఓ పుష్పలత, పామర్తి సురేష్ ఉన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ఉండ్రాజవరం: వార్షిక మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగించే పనుల కారణంగా ఉండ్రాజవరం, వేలివెన్ను, మోర్త, పాలంగి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.వీరభద్రరావు గురువారం తెలిపారు.

కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు

- బరుల యజమానులకు నోటీసులు
- గ్రామాల్లో 144 సెక్షన్ అమలు


అజ్జరంలో కోడి పందేల బరులను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజరాజేశ్వరి

పెరవలి: కోడి పందేలు నిర్వహిస్తే చట్టరీత్యా నేరమని అటువంటివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి హెచ్చరించారు. మండలంలో కోడి పందేలు నిర్వహించే బరులను గురువారం అధికారుల బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కోడి పందేలు నిర్వహించే ఖండవల్లి, ముక్కామల, నల్లాకులవారిపాలెం, పిట్టలవేమవరం, అజ్జరం, వెంకట్రాయపురం, పెరవలి, మల్లేశ్వరం, ఉసులుమర్రు గ్రామాల్లో 144 సెక్షన్ అమలు చేస్తామని తెలిపారు. కోడి పందేలు ఆడించే వారిపై ఇప్పటికే బైండోవర్ కేసులు 142 మందిపై పెట్టామని, ఇంకా కొంత మందిపై పెట్టాల్సి ఉందన్నారు. అంతే కాకుండా బరులు స్థల యజమానులకు నోటీసులు ఇచ్చామని, ఆయా గ్రామాల్లో ప్రచారంతోపాటు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశామన్నారు. పండుగ ముసుగులో గుండాట, పేకాట ఆడటం నేరమని అటువంటి కార్యక్రమాలు జరుగుతున్నాయంటే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. సంక్రాతి ముసుగులో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తప్పవని ఇందుకోసం ముందస్తుగానే ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. ఆయా గ్రామాల నాయకులు, స్థల యాజమానులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


తాళ్లపూడి తహసీల్దార్ క్యాలయంలో సమావేశంలో పాల్గొన్న ఎస్సై, తహసీల్దార్


మాట్లాడుతున్న తహసీల్దారు గంగరాజు

గ్రామాల్లో నిర్వహించకుండా చూడండి

పెరవలి: ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గ్రామాల్లో కోడి పందేలు నిర్విహించకూడదని అందుకు విరుద్ధంగా కోడి పందేలు, జూదాలు సంబంధిత గ్రామాధికారులదే బాధ్యత అని తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి హెచ్చరించారు. పెరవలి మండలం పరిషత్ కార్యాలయంలో గురువారం సాయంత్రం పంచాయతీ కార్యదర్శులు, పోలీసులు, రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎక్కడైనా బరులు ఏర్పాటు చేస్తే ముందస్తు సమాచారం ఇవ్వాలని వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామల్లో పార్టీ నాయకులు, గ్రామ పెద్దల సహకారం తీసుకుని వీటిని అరికట్టాలసిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు, పోలీసు సిబ్బందిదేనన్నారు. ఎంపీడీఓ రమేష్, ఏఎస్సై సూర్య చంద్రరావు, ఈఓపీఆర్‌డీ పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతి లేదు

తాళ్లపూడి: కోడి పందేలు, ఎటువంటి జూద క్రీడలు నిర్వహించడానికి అనుమతి లేదని ఎస్సై కె.వెంకట రమణ తెలిపారు. తాళ్లపూడి తహసీల్దార్ కార్యాలయంలో, తాళ్లపూడి సచివాలయం వద్ద గురువారం అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఎస్సై వెంకట రమణ మాట్లాడుతూ మండలంలో ఇప్పటి మండలంలో 50 మందిపై బైండోవర్ నమోదు చేసినట్టు తెలిపారు. తహసీల్దార్ టి.రాధిక, ఎంపీడీవో వెంకటరమణ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నిడదవోలులో..


ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వీరబ్రహ్మం

నిడదవోలు: సంక్రాంతి ముసుగులో కోడి పందాలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని నిడదవోలు ఎస్ఈబీ ఇన్స్‌పెక్టర్ కె.వీరబ్రహ్మం తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా ఎస్ఈబీ అధికారి పిట్ట సోమశేఖర్ ఆదేశాల మేరకు జూదాలు నివారణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా కోడి పందాలకు బరులు సిద్ధం చేసినా, బెల్ట్ షాపులు నిర్వహించినా, పేకాట, గుండాట లాంటి జూదాలు ఆడినా, మూడు ముక్కలాట, స్కిల్ కాయిన్స్, బాలాట ఆడించడంతో పాటు అక్రమంగా మద్యం విక్రయాలు చేసినట్లయితే ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నిడదవోలు రూరల్: గ్రామాల్లో కోడి పందేలు, జూదం వంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు చేపడతామని తహసీల్దార్ ఎం.గంగరాజు హెచ్చరించారు. సింగవరంలో సర్పంచ్ పెన్మెత్స వెంకటలక్ష్మి అధ్యక్షతన కోడి పందేల నియంత్రణపై తహసీల్దార్ గంగరాజు, పట్టణ ఎస్సై నాగరాజు అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఉపసర్పంచ్ రామరాజు, ఎంపీటీసీ సభ్యులు పెన్మెత్స నిర్మల, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం జగన్ పాలన


చాగల్లులో రోడ్డుకు శంకుస్థాపన చేసి, శిలాఫలకం ఆవిష్కరించిన హోం మంత్రి తానేటి వనిత

రాష్ట్ర హోంమంత్రి, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత

చాగల్లు: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర హోంమంత్రి, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత తెలిపారు. చాగల్లులో రోడ్డు నిర్మాణ పనులకు హోంమంత్రి శంకుస్థాపన చేశారు. గురువారం పంచాయతీ రాజ్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని కొబ్బరికాయ కొట్టి నూతన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా హోంమంత్రి తానేటి వనిత మాట్లాడుతూ చాగల్లు గ్రామం జుట్టా వారి వీధి నుంచి లక్ష్మీపురం వరకూ బీటీ రోడ్డు నిర్మాణం కోసం 7.80 కోట్ల రూపాయలను ఖర్చు చేయనున్నట్టు తెలిపారు. ఈ నిధులు పంచాయతీ రాజ్ నుంచి మంజూరయ్యాయని తెలిపారు. కొవ్వూరు నియోజకవర్గంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల కారణంగా కొవ్వూరు ఆదర్శ ప్రాయంగా నిలుస్తుందన్నారు. సుదీర్ఘకాలంగా విజ్జేశ్వరం బ్యారేజ్ వద్ద ఉన్న రోడ్డు సమస్యకు ఇటీవల మరమ్మతులు, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంపై ఎలాంటి చర్చకైనా సిద్ధమని హోంమంత్రి తానేటి వనిత స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు గంగ్రోతు సురేంద్రకుమార్, వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరరావు, చాగల్లు సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి మండల వైసీపీ గౌరవాధ్యక్షులు జుట్టా కొండలరావు, అధ్యక్షులు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, వైసీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, సీనియర్ నాయకులు గెడా శ్యామ్, లక్కంసాని సూర్యప్రకాశరావు, ఎంఆర్ ఇన్‌ఫ్రా సంస్థ గుత్తేదారుడు మేడా ప్రసాద్, సొసైటీ అధ్యక్షులు గూడపాటి శివ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

ఇంటింటికీ శ్రీరాముని అక్షతల పంపిణీ

దేవరపల్లి: శ్రీరామ జన్మభూమి అయోధ్య నుంచి వచ్చిన శ్రీరామ అక్షతలను గురువారం పల్లంట్లలో భక్తులు ఇంటింటికీ పంపిణీ చేశారు. అక్షతలు, రామమందిరం చిత్రపటాలను అందజేశారు. కార్యక్రమంలో అయోధ్య రామజన్మభూమి తీర్థయాత్ర క్షేత్ర నిధి సమర్పణ సభ్యులు బలుసు సత్యనారాయణ, విజయలక్ష్మి దంపతులు , పిన్నమనేని వెంకటరత్నం, మొక్కపాటి శ్రీనివాసరావు, ఉప్పలపాటి మాధవరావు, భక్తులు పాల్గొన్నారు.


అక్షతలు, రామమందిరం చిత్రపటాలను అందజేస్తున్న భక్తులు

శరవేగంగా రోడ్డు అభివృద్ధి పనులు

అధికారులతో కలిసి పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్


పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు: పట్టణంలోని గణేష్ చౌక్ సెంటర్ నుంచి గణపతి సెంటర్ వరకూ రూ.5.25 కోట్ల వ్యయంతో చేపట్టిన నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గణపతి జంక్షన్ అభివృద్ధి పనులను అధికారులతో కలసి గురువారం మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. పట్టణంలో పాటిమీద సెంటర్ నుండి గణపతి సెంటర్ వరకూ ప్రస్తుతం లాకింగ్ టైల్స్ పనులు సాగుతున్నాయి. మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ మాట్లాడుతూ గణపతి జంక్షన్ అభివృద్ధిలో భాగంగా విశాలమైన నాలుగు లేన్ల రోడ్డు, వాటర్ ఫౌంటేన్, సుందరమైన పార్కు, మంచినీటి పైప్‌లైన్, డ్రైనేజీ, బస్‌సెల్టర్ పచ్చదనంతో కూడిన ఆహ్లాదకరమైన సుందరీకరణ పనులు జోరుగా జరుగుతున్నాయన్నారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో పట్టణానికి వచ్చే వాహనాల రాకపోకలకు ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టామన్నారు. గణపతి జంక్షన్‌లో ఇరువైపులా కొత్తగా నిర్మించిన రోడ్డుపై శుక్రవారం సాయంత్రం నుంచి వాహనాల రాకపోకలకు అనుమతిస్తున్నామన్నారు. రోడ్డు నిర్మించని ప్రాంతంలో జేసీబీతో చదును చేసి ట్రాఫిక్‌ను వదలాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గోపిరెడ్డి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు గాజుల రంగారావు, ఆలమూరి రాజ, మున్సిపల్ డీఈ మాదవీ, ఏఈ హేమంత్‌కమల్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అడ్డొస్తే సహించం

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- ఖండవల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

పెరవలి: గ్రామాల అభివృద్ధికి ఏ పార్టీ వారైనా అడ్డంకిగా మారితే సహించేది లేదని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు హెచ్చరించారు. పెరవలి మండలం ఖండవల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. గ్రామాల అభివృద్ధికి లక్షల కోట్ల రూపాయలు ఇస్తున్నామని వీటి అభివృద్ధికి ప్రతిపక్షపార్టీలు అడ్డు తగులుతూనే ఉన్నారన్నారు. ఈ గ్రామంలో రూ.30 కోట్లతో వివిధ పనులు చేపట్టామని, అలాగే సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు రూ.60 కోట్ల మేర లబ్ధిచేకూరిందన్నారు. ఇటువంటి సంక్షేమ ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా ఉండాలన్నారు. తాను రాజకీయాలు చేయాడానికి రాలేదని అభివృద్ధి చేయడానికి ఈ నియోజక వర్గానికి వచ్చానని, అందుకోసం మీరు ఏదైనా అడగొచ్చని చెప్పడంతో లబ్ధిదారులు ఆనందంతో చప్పట్లు కొట్టారు. టీడీపీ, జనసేన పార్టీల మాదిరిగా ఒకటి చెప్పి మరొకటి చేయమని, చెప్పిందే చేస్తామని, చెప్పనవి కూడా ఎన్నో చేశామన్నారు. ప్రజా సంక్షేమం కోరే ప్రభుత్వం కావాలా లేక ప్రతి పక్షాలు చెప్పే మోసపూరిత వాగ్దానాలు కావాలా మీరే తేల్చుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా 540 ఇళ్లకు వెళ్లి నేరుగా లబ్ధిదారులతో సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడగడంతో పాటు ప్రజల దీవెనలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు వీరమళ్ళు సత్యనారాయణ ఎంపీటీసీ సభ్యురాలు బొకే వెంకటేశ్వర్లు, పల్లేటి రవి, సొసైటీ అధ్యక్షుడు కుసుమే సూరిబాబు గ్రామ పార్టీ అధ్యక్షుడు కంద వెంకన్న, నాయకులు చిన్నబాబు, నాగు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలి

ఉండ్రాజవరం: ఈనెల 30, 31వ తేదీల్లో జరిగే కల్లు గీత కార్మిక సంఘం మహాసభలను జయప్రదం చేయాలని ఏపీ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జుత్తిగ నరశింహమూర్తి పిలుపునిచ్చారు. రాష్ట్ర మహాసభలు ప్రచారంలో భాగంగా ఉండ్రాజవరంలో గురువారం గీత కార్మిక సంఘం నాయకులు ప్రచారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి, ఉపాధ్యక్షుడు వీరరాఘవులు, మండల కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హోమియో వైద్య శిబిరం

నిడదవోలు: పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. హోమియో వైద్యులు హరిశ్రీనివాస్ మాట్లాడుతూ కోవిడ్, వైరల్ జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.రామకృష్ణ చేతుల మీదగా న్యాయవాదులు, కక్షిదారులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రవికుమార్, కోర్టు సూపరింటిండెంట్ ఎస్. సురేష్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి


నల్లజర్లలో తెలికిచెర్ల-శింగరాజుపాలెం జట్ల మధ్య వాలీబాల్ పోటీలు

నల్లజర్ల: యువత క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని తెలికిచెర్ల సర్పంచ్ బండి చిట్టీ అన్నారు. నల్లజర్ల జెడ్పీహైస్కూలులో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను గురువారం ఆయన తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తి కలిగి ఉండాలన్నారు. క్రీడలలో గెలుపు ఓటమిలు సహజమన్నారు. క్రీడాకారులు లక్ష్యసాధన దిశగా అడుగులు వేయాలన్నారు. యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసి రాష్ట్ర స్థాయిలో తగిన గుర్తింపు తీసుకురావాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. హెచ్ఎం కోమలిచిత్ర, గ్రామ కార్యదర్శి మూర్తి, పీఈటీలు పీవీ అప్పారావు, రాజారావు, సుధ తదితరులు పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనుల పరిశీలన


షాపింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

దేవరపల్లి: స్థానిక బస్టాండ్ వద్ద పంచాయతీ నిధులు, లబ్ధిదారుల భాగస్వామ్యంతో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌ను ఎమ్మెల్యే తలారి వెంకట్రావు గురువారం పరిశీలించారు. సుమారు రూ.25 లక్షలతో ఆరు గదుల కాంప్లెక్స్ నిర్మిస్తున్నారు. గత టీడీపీలో బస్టాండ్ నిర్మాణ సమయంలో దుకాణాలు కోల్పోయిన వ్యాపారులు అప్పట్లో ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేసి ఇవ్వాని మొరపెట్టుకున్నారు. వీరి మొరను పట్టించుకోలేదు. దాదాపు ఎనిమిదేళ్లగా వ్యాపారులు అద్దెలు కట్టలేక ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని వ్యాపారులు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, సర్పంచ్ కడిమి వీరకుమారిని కలిసి విన్నవించారు. దీనితో ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని పంచాయతీ నిధులు రూ.25 లక్షలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారు. గతంలో దుకాణాలు కోల్పోయిన వ్యాపారులకు గదులు కేటాయించనున్నట్టు సర్పంచ్ వీరకుమారి తెలిపారు.

సారా బట్టీలపై దాడులు


చిట్యాల శివార్లలో పట్టుకున్న సారా సామగ్రి, నిందితుడితో పోలీసులు

నల్లజర్ల: ఎస్ఈబీ అధికారులు గురువారం సారా బట్టీలపై నిర్వహించిన దాడుల్లో అనంతపల్లిలో వెలగన నాగేశ్వరావు వద్ద నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్టు సిఐ డి.సుధ తెలిపారు. ఈ దాడిలో ఎస్ఐ సుధీర్, సిబ్బంది శ్రీకాంత్ పాల్గొన్నారు.

గోపాలపురం: సారా బట్టీలపై దాడులు నిర్వహించి 400 లీటర్ల బెల్లపు ఊట, 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు గోపాలపురం ఎస్సై కర్రి సతీష్ కుమార్ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిట్యాల గ్రామ శివార్లలో సారా బట్టీలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించగా అక్కడ సారా తయారీకి సిద్ధంగా ఉన్న 400 లీటర్ల బెల్లపు ఊట, 20 లీటర్ల సారాతో పాటు తయారీకి ఉపయోగించే పరికరాలను ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్సై తెలిపారు.

వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ చిన్నారి మృతి

- హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి
- నేడు మద్దూరు రానున్న భౌతిక కాయం
- సంతాపం ప్రకటించిన హోమ్ మంత్రి తానేటి వనిత, నాయకులు


గురుజు బాల మురళీ కృష్ణ(చిన్నారి) ఫైల్

కొవ్వూరు: మద్దూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గురుజు బాల మురళీకృష్ణ (చిన్నారి)(62) అనారోగ్య కారణంగా హైదరాబాద్‌లో గురువారం సాయంత్రం మృతి చెందారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంగా బాధపడుతున్నారు. దీంతో హైదరాబాద్ లోనే ఉంటూ చికిత్స పొందుతున్నారు. ఈయన గతంలో మద్దూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘానికి అధ్యక్షుడిగా ఐదేళ్లపాటు పని చేశారు. వైఎ స్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వత ఇదే సొసైటీకి మూడు విడతలు త్రీమన్ కమిటీ చైర్మన్‌గా పని చేశారు. చిన్నారికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. 22 రోజుల క్రితమే ఆయన అల్లుడు మృతి చెందారు. శుక్రవారం ఆయన భౌతిక కాయాన్ని స్వగ్రామమైన మద్దూరు తీసుకురానున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అంత్యక్రియలు గ్రామంలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. చిన్నారి మృతిపై రాష్ట్ర హోమ్ మంత్రి తానేటి వనిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి తన సంతాపాన్ని తెలియజేశారు. మాజీ ఏఎంసీ చైర్మన్ బండి పట్టాభిరామారావు, మద్దూరు సొసైటీ ప్రస్తుత అధ్యక్షుడు తోట నారాయణ, నాయకులు సంగీతం చిన్న వెంకటేశ్వర్లు, ముదు నూరి నాగరాజు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

నేడు ముస్లిం మహోన్నత వ్యక్తుల చిత్ర పటాల ప్రదర్శన

నిడదవోలు: పట్టణంలోని జామియా మసీదు వద్ద షెహరి జమ్‌యియ్యత్ అహ్లె హదీస్ ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంగల వరకు ముస్లిం మహోన్నత వ్యక్తుల చిత్ర పటాల ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

నెహ్రూనగర్ రిజర్వాయర్ ప్రాంతాలకు నీటి సరఫరా

నిడదవోలు : పట్టణంలోని నెహ్రూనగర్ రిజర్వాయర్ ప్రాంతాల ప్రజల తాగునీటి అవసరాల కోసం గురువారం ఉదయం నుంచి రెండు సార్లు పూర్తిస్థాయిలో నీటి సరఫరా చేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నెహ్రూనగర్ మంచి నీటి రిజర్వాయర్ నుంచి వచ్చిన ప్రధాన నీటి సరఫరా పైప్‌లైన్ 40 ఏళ్ల క్రితం నిర్మించిన సిమెంట్ పైప్‌లైన్ ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో పైపులైన్ వెంబడి తరచూగా మైనర్ లీకులు, పలు చోట్ల మేజర్ లీకులు ఏర్పడటంతో మంచినీరు వృథాగా పోతోంది. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ఆదేశాలతో శిథిలావస్థకు చేరిన పైప్‌లైన్‌ను పూర్తిగా తొలగించి వాటి స్థానంలో హెచ్‌డీపీఈ కొత్త పైప్‌లైన్ నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టామన్నారు. మంచినీటి పరఫరాకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా శాశ్వతంగా కొత్త పైపులైన్ పనులు పూర్తి చేశామన్నారు. శిథిలస్థితికి చేరిన సిమెంట్ పైప్‌లైన్ నుంచి హెచ్‌డీపీఈ పైప్‌లైన్‌కు ఇంటర్ కనెక్షన్ ఇచ్చు సమయంలో తలెత్తిన సాంకేతిక సమస్యలతో నీటి సరఫరాకు జాప్యం జరిగిందని కమిషనర్ పద్మావతి స్పష్టం చేశారు. యుద్ధప్రాతిపదికన చేపట్టిన పైప్‌లైన్ పునరుద్ధణ పనుల నేపథ్యంతో నీటి సరఫరా నిలిపివేశామన్నారు. ఈ సమయంలో ప్రజలకు మంచినీటి ఇబ్బందులు లేకుండా నెహ్రూనగర్ రిజర్వాయర్‌కు సంబంధ/ంచిన ప్రాంతాలకు వాటర్ ట్యాంకర్ల ద్వారా మంచి నీటి పరఫరా చేపట్టామన్నారు.

పిచ్చి కుక్క స్వైర విహారం

కొవ్వూరు: పట్టణంలో గురువారం సాయంత్రం పిచ్చి కుక్క స్వై విహారం చేసి ఐదుగురిని గాయపరిచింది. బీజేపీ నాయకుడు గెల్లా కేశవ స్వల్పంగా గాయపడ్డారు. ఆయనతో పాటు చిన వెంకటేశ్వ రస్వామి గుడి వీధి, ఎస్ఈబీ కార్యాలయంలో వీధుల్లో నలుగురిని కరవడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మునిసిపల్ అధికారులు ఆ కుక్కను బంధించే ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.